నేడు స్కాలర్‌షిప్‌లు, నోట్‌బుక్కుల పంపిణీ

బన్సీలాల్‌పేట్: పాన్‌బజార్‌లోని జైన్ మందిర్ భవన్‌లో కేంద్రమంత్రి జి. కిషన్‌రెడ్డి ఈనెల 22న (నేడు) నిరుపేద విద్యార్థులకు స్కాలర్‌షిప్ లు, పుస్తకాలు పంపిణీ చేయనున్నట్లు బీజేపీ ఓబీసీ మోర్చా రాష్ట్ర ఉపాధ్యక్షుడు చీర శ్రీకాంత్ శనివారం ఓ ప్రకటనలో తెలిపారు. టెన్త్, ఇంటర్, డిగ్రీలో అత్యధిక మార్కులు సాధించిన వారికి రూ.10వేలు, రూ.5వేలు, రూ.2,500 చొప్పున స్కాలర్‌షిప్‌లు, అదేవిధంగా 6-10వ తరగతి వరకు విద్యార్థులకు నోట్‌బుక్కులు అందజేస్తారని పేర్కొన్నారు. ఉదయం 11 గంటలకు జరిగే ఈ కార్యక్రమంలో కేంద్రమంత్రి కిషన్‌రెడ్డితో పాటు రాంగోపాల్‌పేట్ కార్పొరేటర్ చీర సుచిత్ర, మాజీ మంత్రి మర్రి శశిధర్ రెడ్డి, మాజీ ఎమ్మెల్యే చింతల రామచంద్రారెడ్డి, మహంకాళి జిల్లా అధ్యక్షుడు భరత్ గౌడ్, టి. రాజశేఖరరెడ్డి, శ్యాంసుందర్ గౌడ్ తదితరులు హాజరుకానున్నట్లు తెలిపారు.

మంత్రి అడ్లూరిని కలిసిన నేతలు



మంత్రి అడ్లూరి లక్ష్మణ్‌తో ఎమ్మార్పీఎస్ జిల్లా ఉపాధ్యక్షుడు శ్రీకిషన్

కంటోన్మెంట్: ఎస్సీ, ఎస్టీ, మైనార్టీ, దివ్యాంగులు, వృద్ధుల సాధికారిత శాఖల మంత్రి అడ్లూరి లక్ష్మణ్‌ను ఎమ్మార్పీఎస్ హైదరాబాద్ జిల్లా ఉపాధ్యక్షుడు ఇటుక శ్రీ కిషన్ మాదిగ శనివారం మర్యాదపూర్వకంగా కలిశారు. ఈ సందర్భంగా పుష్పగుచ్ఛం అందించి శుభాకాంక్షలు తెలిపారు. అనంతరం శ్రీకిషన్ మాట్లాడుతూ..బడుగు, బలహీన వర్గాలకు ప్రభుత్వ సంక్షేమ ఫలాలు సక్రమంగా అందేలా చర్యలు తీసుకోవాలని మంత్రిని కోరామన్నారు.

వ్యక్తి అదృశ్యం



బౌద్ధనగర్: వ్యక్తి అదృశ్యమైన ఘటన వారాసీగూడ పోలీస్ స్టేషన్ పరిధిలో జరిగింది. ఎస్ఐ సునీత తెలిపిన వివరాల ప్రకారం.. బౌద్ధనగర్‌లో నివసించే మాడిపల్లి మల్లయ్య (59) గత నెల 29న ఇంటి నుంచి వెళ్లి తిరిగి రాలేదు. దీంతో కుటుంబ సభ్యులు పలుచోట్ల, బంధువుల వద్ద గాలించినా ఆచూకీ లభించలేదు. మల్లయ్య కుమారుడు సాయిరాం శనివారం వారాసీగూడ పీఎస్‌లో ఫిర్యాదు చేయగా కేసు నమోదు చేసిన పోలీసులు దర్యాప్తు చేస్తున్నారు.

దోమలు వృద్ధి చెందకుండా చర్యలు



ఫాగింగ్ ప్రారంభిస్తున్న కార్పొరేటర్ శైలజ

బౌద్ధనగర్: బౌద్ధనగర్‌లో డివిజన్ కార్పొరేటర్ కంది శైలజ ఎంటమాలజీ విభాగం అధికారులతో కలిసి ఫాగింగ్‌ను శనివారం ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ.. వర్షాకాలం దృష్ట్యా డివిజన్‌లో దోమలు వృద్ధి చెందకుండా చర్యలు తీసుకుంటున్నామన్నారు. కార్యక్రమంలో కంది నారాయణ, పాక సాయి, మంద జగన్, చిందకింది మల్లేశ్ తదితరులు పాల్గొన్నారు.

విద్యుత్ వైర్లకు తగిలిన రెడీమిక్స్ వాహనం



లాలాపేట: లాలాపేట ప్రధాన రహదారి రామ్ థియేటర్ సమీపంలో శనివారం సాయంత్రం ఓ రెడీమిక్స్ వాహనం విద్యుత్ వైర్లకు తగలగా క్లాంప్ విరిగి విద్యుత్ సరఫరా నిలిచిపోవడంతో లాలాపేట ప్రధాన రహదారి, వినోభానగర్ ప్రాంతాల్లో చిమ్మచీకట్లు కమ్ముకున్నాయి. ఈ విషయమై సంబంధిత అధికారులకు ఫిర్యాదు చేసినా స్పందించడం లేదని లాలాపేటకు చెందిన శాంసన్ ఆరోపించారు.

ఎర్రగడ్డ రైతుబజార్‌లో కూరగాయల ధరలు

సనత్‌నగర్: టమాటా రూ.23, నల్లవంకాయ 23, పొడుగు వంకాయ 23, బెండకాయ 40, పచ్చిమిర్చి 45, బజ్జీమిర్చి 23, క్యాప్సికం 60, పచ్చికాకర 42, పందిరి బీర 38, క్యాబేజీ 17, క్యారెట్ 40, దొండ 15, గుండుబీన్స్ 65, గింజ చిక్కుడు 55, గోకరకాయ 40, కీర 23, దోసకాయ 18, బీట్‌రూట్ 25, ఉల్లిగడ్డ 22, ఆలుగడ్డ 24, చామగడ్డ 28, మొరంగడ్డ 19, కందగడ్డ 45, సొరకాయ 11, పొట్లకాయ 23, అరటికాయ 11, మునగకాయ 3-4. ఈ ధరలు ఆదివారం ఉదయం 9 గంటల వరకు అమల్లో ఉంటాయి.

కొత్త బీఎల్ఓలు వచ్చేశారు..!

- సికింద్రాబాద్ నియోజకవర్గంలో పూర్తయిన కసరత్తు
- వివిధ శాఖల నుంచి 58 మంది సర్దుబాటు
- వారంలో ఇంటింటా ఓటరు జాబితా పరిశీలన
- పకడ్బందీగా ప్రక్షాళనకు కార్యాచరణ సిద్ధం



బీఎల్ఓల నియామక ప్రక్రియలో సికింద్రాబాద్ ఎలక్ట్రోల్ రిజిస్ట్రేషన్ ఆఫీసర్ డి.సుభాష్‌రావు

సికింద్రాబాద్ నియోజకవర్గం	
బూత్‌లు:	220
ఓటర్లు:	2,68,716
పురుషులు:	1,33981
మహిళలు:	1,34706
ట్రాన్స్‌జెండర్లు:	29

సికింద్రాబాద్: సికింద్రాబాద్ నియోజకవర్గంలో బీఎల్ఓల మార్పు కసరత్తు పూర్తయ్యింది. బూత్‌లెవల్ ఆఫీసర్ల వ్యవస్థలో సమూలంగా మార్పులు తేవాలని ఇందుకోసం కనీసం జూనియర్ అసిస్టెంట్ స్థాయి మొదలు సూపరింటెండెంట్ హోదా గల ఉద్యోగులను మాత్రమే బీఓఎల్‌గా నియమించాలన్న కేంద్ర ఎన్నికల సంఘం ఆదేశాల మేరకు సికింద్రాబాద్ నియోజకవర్గ ఎలక్ట్రోల్ రిజిస్ట్రేషన్ ఆఫీసర్ డి.సుభాష్‌రావు నేతృత్వంలో ఎన్నికల విభాగం అధికారులు హేమలత, పవన్ బీఎల్ఓల జాబితాను సిద్ధం చేశారు. వీరంతా త్వరలోనే ఇంటింటా తిరుగుతూ ఓటర్ జాబితాను ప్రక్షాళన చేయనున్నారు

58 మంది తొలగింపు

◆ నియోజకవర్గంలో 220పోలింగ్ బూత్‌లు ఉన్నాయి. గతంలో ఒక్కో బూత్‌కు ఒక్కరు చొప్పున 220 మంది బూత్ లెవల్ ఆఫీసర్లను నియమించారు. వారిపై మరో 25మందిని పర్యవేక్షక అధికారులుగా ఉన్నారు. వీరంతా జీహెచ్ఎంసీ ఉద్యోగులు కావడం గమనార్హం. ఇదిలా ఉండగా బూత్ లెవల్ ఆఫీసర్లుగా పనిచేసే ఉద్యోగులకు ఉండాల్సిన అర్హతలపై కేంద్ర ఎన్నికల సంఘం స్పష్టమైన ఆదేశాలను జారీచేసింది. కనీస విద్యార్హత టెన్త్ పాస్ అయిన ఉద్యోగులు మాత్రమే బీఓఎల్‌గా పని చేయాలన్న నిబంధన ఉంది. దీని ప్రకారం ప్రస్తుతం నియోజకవర్గంలో బీఎల్ఓలుగా పనిచేస్తున్న 220 మందిలో జీహెచ్ఎంసీ ఉద్యోగుల్లోంచి 58 మందిని తొలగించాల్సి వచ్చింది. ప్రస్తుతం 162 మంది జీహెచ్ఎంసీ ఉద్యోగులను మాత్రమే కొనసాగిస్తూ మిగతావారిని సిటీ సివిల్ సప్లై, కమర్షియల్ ట్యాక్స్, తెలంగాణ రాజ్యాభిలేఖన పరిశోధన విభాగాల నుంచి 58 మందిని నియమించారు.

ప్రక్షాళన తీరు

◆ బూత్ లెవల్ ఆఫీసర్లు ఇంటింటా తిరుగుతూ ఓటరు జాబితాను సమూలంగా ప్రక్షాళన చేయాలని అధికారులు సూచిస్తున్నారు. తప్పుల సవరణ, కొత్త పేర్లు చేర్చడం, మృతుల పేర్లు, చిరునామా మారిన వారిని జాబితా నుంచి తొలగించడం వంటి వివరాలను పకడ్బందీగా జాబితాలో నమోదు చేస్తారు.

◆ ఒకే భవనంలో నివసిస్తున్న కుటుంబాలకు చెందిన ఓటర్లు అందరూ ఒకే పోలింగ్ బూత్‌లో ఓటు వేసేలా చూడాలని కేంద్ర ఎన్నికల సంఘం నిర్దేశించింది.

◆ గతంలో విద్యార్హత లేని వారు బీఓఎల్‌గా పని చేసిన నేపథ్యంలో పేర్ల నమోదు, ఇంటి నంబర్ల నమోదులో తప్పులు చోటు చేసుకున్నాయి. ఈసారి అలాంటి తప్పిదాలకు అవకాశం లేకుండా చర్యలు తీసుకోనున్నారు.

◆ ఒక్కో పోలింగ్ బూత్‌లో 1400 మందికి మించి ఓటర్లు ఉండకుండా చర్యలు తీసుకోవాలని, ఎక్కువ మంది ఓటర్లు ఉంటే సమీపంలోని పోలింగ్ బూత్‌కు భవనంలోని ఓటర్లందరినీ బదలాయించేందుకు చర్యలు తీసుకుంటారు. ఇందుకోసం పక్కాగా నజరీనక్షాలు రూపొందించేందుకు చర్యలు తీసుకుంటున్నారు.

ఆగస్టు నాటికి జాబితా పూర్తి

◆ ఓటర్ జాబితా ప్రక్షాళనను కొద్ది రోజుల్లో ప్రారంభిస్తామని సికింద్రాబాద్ నియోజకవర్గ ఎలక్ట్రోల్ రిజిస్ట్రేషన్ ఆఫీసర్ డి.సుభాష్‌రావు తెలిపారు. వివిధ విభాగాల నుంచి వచ్చిన ఉద్యోగులతో సమర్థవంతమైన బీఎల్ఓ వ్యవస్థను ఏర్పాటు చేశామని, ఈ ఆగస్టులోగా ఓటర్ల జాబితాను పూర్తిస్థాయిలో ప్రక్షాళన చేసేందుకు కార్యాచరణ సిద్ధం చేశామని ఆయన పేర్కొన్నారు.

ప్రొఫెసర్ జయశంకర్‌కు ఘన నివాళి



నివాళులర్పిస్తున్న కార్పొరేటర్ కె.హేమలత, వెంకటేషన్‌రాజు తదితరులు



లాలాపేటలో నివాళులర్పిస్తున్న బీఆర్ఎస్ నాయకులు

లాలాపేట: తార్నాకలోని డిప్యూటీ మేయర్ కార్యాలయంలో తెలంగాణ సిద్ధాంతకర్త ప్రొఫెసర్ జయశంకర్ వర్ధంతిని శనివారం నిర్వహించారు. ఈ సందర్భంగా డిప్యూటీ మేయర్ మోతే శ్రీలత, టిటియుసి రాష్ట్ర అధ్యక్షుడు మోతే శోభన్‌రెడ్డి ఆయన చిత్రపటానికి పూలమాల వేసి ఘనంగా నివాళులర్పించారు. అలాగే లాలాపేటలోని జయశంకర్ విగ్రహానికి స్థానిక బీఆర్ఎస్ నాయకులు పూలమాలతో నివాళులర్పించారు. కార్యక్రమంలో సీహెచ్ సునీల్ ముదిరాజ్, వేణుగోపాల్‌రెడ్డి, నాగులు, శంకర్, ప్రదీప్, డెంజిల్, లింగం, రఘుగౌడ్, యాదగిరి, దర్శన్, జేఏసీ అధ్యక్షుడు మహేశ్ తదితరులు ఉన్నారు.

బోయిగూడ ఉప్పలమ్మ ఆలయం వద్ద..

బన్సీలాల్‌పేట్: బోయిగూడ ఉప్పలమ్మ ఆలయం వద్ద తెలంగాణ సిద్ధాంతకర్త ప్రొఫెసర్ జయశంకర్ వర్ధంతిని శనివారం నిర్వహించారు. బన్సీలాల్‌పేట్ డివిజన్ బీఆర్ఎస్ అధ్యక్షుడు వెంకటేషన్‌రాజు ఆధ్వర్యంలో జరిగిన ఈ కార్యక్రమంలో పలువురు నాయకులు పాల్గొని జయశంకర్ విగ్రహానికి పూలమాలలు వేసి ఘనంగా నివాళులర్పించారు. కార్పొరేటర్ కె. హేమలత, నాయకులు లక్ష్మీపతి, విజయ్ శంకర్, దేవేందర్, దేశపాక శ్రీనివాస్, కుమార్‌యాదవ్, కుషాల్, అనిల్, సురేశ్ తదితరులు పాల్గొన్నారు.

ఉత్సాహంగా యోగాసనాలు



సనత్‌నగర్: ఎర్రగడ్డ కల్పతరు రెసిడెన్సీ అపార్ట్‌మెంట్‌లో శనివారం అంతర్జాతీయ యోగా దినోత్సవాన్ని ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా 100 మంది నివాసితులు ఉదయాన్నే యోగాసనాలు వేశారు. ఆరోగ్యాన్ని మెరుగుపర్చే యోగా ప్రాముఖ్యతపై గురువులు సాంబశివరావు, మురళి, సుహాసిని, అరుణ ప్రసంగించారు.

ప్రభుత్వ పాఠశాలకు సౌండ్ సిస్టం వితరణ



సౌండ్ సిస్టంను అందిస్తున్న సాయిబాబా

చిలకలగూడ : సాయిబాబా సమేత బాలాంజనేయ స్వామి ఆలయ ఫౌండర్‌ట్రస్టీ, కాంగ్రెస్ సీనియర్ నాయకుడు నాగులూరి సాయిబాబా దూద్‌బావి ప్రభుత్వ పాఠశాలకు సౌండ్ సిస్టంను శనివారం వితరణగా అందించారు. చిలకలగూడలోని తన కార్యాలయంలో శనివారం జరిగిన కార్యక్రమంలో ఆ పాఠశాల ప్రధానోపాధ్యాయుడు మల్లికార్జునరెడ్డికి అందించారు. ఈ సందర్భంగా సాయిబాబా మాట్లాడుతూ.. ప్రభుత్వ పాఠశాలల్లో మౌలిక వసతులు మరింత మెరుగు పర్చేందుకు సీఎం ప్రవేశపెట్టిన అమ్మ ఆదర్శ కమిటీలు ఎంతగానో దోహదపడతాయన్నారు. ఈ సందర్భంగా విద్యార్థులు, ఉపాధ్యాయులు సాయిబాబాకు కృతజ్ఞతలు తెలిపారు.

డిగ్రీ కోర్సుల్లో సిలబస్ మార్పు

కొత్తగా ఏఐ, సైబర్ లా సబ్జెక్టులు

ఉస్మానియా యూనివర్సిటీ: డిగ్రీ కోర్సుల సిలబస్ మారనున్నది. మారిన పరిస్థితులకు అనుకూలంగా ఈ విద్యా సంవత్సరం నుంచే మార్కెట్ అవసరాలకు తగిన ఉద్యోగ, ఉపాధి ఇచ్చే కోర్సులను ప్రవేశ పెట్టేందుకు నూతన సిలబస్‌ను ఓయూ ప్రొఫెసర్ల సారథ్యంలో రూపొందిస్తున్నారు. బీఏ, బీకాం, బీఎస్సీ, బీబీఎం మొదటి సంవత్సరం విద్యార్థులకు ఏఐ (ఆర్టిఫిషియల్ ఇంటెలిజెన్స్), సైబర్ లా తదితర కొత్త సబ్జెక్టును ప్రవేశ పెడుతున్నట్లు సిలబస్ కమిటీ సభ్యుడు ఓయూ సీనియర్ ప్రొఫెసర్ ప్రొ.అప్పారావు తెలిపారు.

వాటర్‌వర్క్స్ జీఎం బాధ్యతల స్వీకరణ

సనత్‌నగర్: ఖైరతాబాద్ జోన్ పరిధిలోని సనత్‌నగర్, అమీర్‌పేట డివిజన్ల వాటర్‌వర్క్స్ జీఎంగా ప్రభాకర్‌రావు శనివారం బాధ్యతలు చేపట్టారు. అనంతరం వెస్ట్‌మారేడ్‌పల్లిలోని కార్యాలయంలో ఎమ్మెల్యే తలసాని శ్రీనివాస్‌యాదవ్‌ను మర్యాద పూర్వకంగా కలిశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే ఆయనకు శుభాకాంక్షలు తెలిపారు. జీఎం వెంట డీజీఎం వంశీ ఉన్నారు.

ఎమ్మెల్యే పాడి కౌశిక్‌రెడ్డి అరెస్టు ఖండించిన ఎమ్మెల్యే

హుజురాబాద్ ఎమ్మెల్యే పాడి కౌశిక్‌రెడ్డి అరెస్టును సనత్‌నగర్ ఎమ్మెల్యే తలసాని శ్రీనివాస్‌యాదవ్ శనివారం ఓ ప్రకటనలో తీవ్రంగా ఖండించారు. ఎన్నికల సమయంలో ఇచ్చిన హామీలు అమలు చేయలేక, ప్రజల దృష్టిని మళ్లించేందుకే అక్రమ కేసులు పెడుతూ అరెస్టులు చేస్తున్నారని ఆరోపించారు. ప్రజలు అన్ని గమనిస్తున్నారని, సరైన సమయంలో కాంగ్రెస్ ప్రభుత్వానికి తగిన బుద్ధి చెబుతారని హెచ్చరించారు.

అపోలో రోడ్లపై ఆక్రమణల తొలగింపు



బంజారాహిల్స్: జూబ్లీహిల్స్‌లోని అపోలో ఆస్పత్రి రోడ్డులో ఫుట్‌పాత్ ఆక్రమణలను జూబ్లీహిల్స్ ట్రాఫిక్ పోలీసులు శనివారం తొలగించారు. వెస్ట్‌జోన్ ట్రాఫిక్ ఏసీపీ కట్టా హరిప్రసాద్ పర్యవేక్షణలో ట్రాఫిక్ పోలీసులు రోడ్డుకు ఇరు వైపులా ఫుట్‌పాత్‌లతో పాటు దుకాణాల ముందు, రోడ్ల పక్కన ఏర్పాటు చేసిన తోపుడుబండ్లు, ఇతర సామాగ్రిని సీజ్ చేశారు. రెండు నెలల క్రితం ఈ రోడ్డంతా ఆపరేషన్ రోప్ నిర్వహించి ఫుట్‌పాత్‌లను పాదచారులకు అందుబాటులోకి తీసుకురాగా, రెండు వారాల నుంచి మళ్లీ ఫుట్‌పాత్ ఆక్రమణలు చోటుచేసుకున్నాయి. జూబ్లీహిల్స్ ట్రాఫిక్ పోలీసుల నిర్వాకంతో అపోలో రోడ్డు మరోసారి ఫుట్‌పాత్ ఆక్రమణలతో నిండిపోయి ట్రాఫిక్ ఏసీపీకి పెద్ద ఎత్తున ఫిర్యాదులు అందాయి. దీంతో శనివారం స్పెషల్ డ్రైవ్ చేపట్టి ఆక్రమణలు తొలగించారు. మరోసారి ఏర్పాటు చేస్తే కేసులు నమోదు చేయాల్సి వస్తుందని ఏసీపీ హెచ్చరించారు. స్పెషల్ డ్రైవ్‌లో ఎస్ఐ అశోక్ కూడా పాల్గొన్నారు.

7న ఒంగోలులో మాదిగ మహా మేళా

హిమాయత్‌నగర్: మాదిగ రిజర్వేషన్ పోరాట సమితి(ఎమ్మార్పీఎస్) 31వ ఆవిర్భావ దినోత్సవాన్ని పురస్కరించుకుని వచ్చేనెల 7వ తేదీన ఒంగోలు మున్సిపల్ గ్రౌండ్‌లో 'మాదిగ మహా మేళా' నిర్వహిస్తున్నామని ఎమ్మార్పీఎస్ వ్యవస్థాపక అధ్యక్షుడు గురుపాటి బ్రహ్మయ్య పేర్కొన్నారు. మాదిగ అమర వీరుల త్యాగాల ఫలితంగానే వర్గీకరణ వచ్చిందని స్పష్టం చేశారు. బషీర్‌బాగ్ దేశోద్ధారక భవన్‌లో శనివారం ఏర్పాటు చేసిన మీడియా సమావేశంలో ఎమ్మార్పీఎస్ నేతలు ఇటుక రాజుమాదిగ, విజయ్ కుమార్ మాదిగతో కలిసి ఆయన మాట్లాడారు. ఎమ్మార్పీఎస్ 30 ఏళ్ల క్రితం ఈదుమూడి గ్రామంలో ఆవిర్భవించిందని తెలిపారు. 7వ తేదీన ఆ గ్రామంలో మాదిగ అమర వీరుల స్తూపం వద్ద నివాళులర్పిస్తామని చెప్పారు. ఈ స్తూపం వద్దకు మంద కృష్ణమాదిగ వస్తే ఆహ్వానిస్తామని లేకపోతే మాదిగల ద్రోహిగా మిగిలిపోతారని హెచ్చరించారు.

పెండింగ్ బకాయిలను విడుదల చేయాలి



సంతకాల సేకరణ కార్యక్రమంలో ఏఐవైఎఫ్ నేతలు

హిమాయత్‌నగర్: రాష్ట్రవ్యాప్తంగా పెండింగ్‌లో ఉన్న రూ.8 వేల కోట్ల ఇంటర్మీడియట్, డిగ్రీ, ఇంజనీరింగ్, పీజీ, బీఈడీ తదితర వృత్తి విద్యా కోర్సుల విద్యార్థుల బోధన, ఉపకారవేతన ఫీజు బకాయిలను సత్వరమే రాష్ట్రంలోని కాంగ్రెస్ ప్రభుత్వం విడుదల చేయాలని అఖిల భారత యువజన సమాఖ్య(ఏఐవైఎఫ్) రాష్ట్ర కార్యదర్శి కల్లూరు ధర్మేంద్ర డిమాండ్ చేశారు. ఏఐవైఎఫ్ హైదరాబాద్ జిల్లా సమితి ఆధ్వర్యంలో హిమాయత్‌నగర్‌లోని సత్యనారాయణరెడ్డి భవన్ వద్ద శనివారం సంతకాల సేకరణ కార్యక్రమం నిర్వహించారు. నేతలు ఆర్.బాలకృష్ణ, నెర్లకంటి శ్రీకాంత్, మాజీద్ అలీఖాన్, హేమంత్, మహమూద్, విశాల్, నితిన్, కీర్తన, మృణాళిని, సీమ, రమ్య తదితరులు పాల్గొన్నారు.

పెవిలియన్ రెస్టారెంట్ సీజ్



పెవిలియన్ రెస్టారెంట్‌ను సీజ్ చేస్తున్న జీహెచ్ఎంసీ సిబ్బంది

బంజారాహిల్స్: జూబ్లీహిల్స్ కో-ఆపరేటివ్ సొసైటీ రోడ్డు నంబర్-51 ప్లాట్‌నెంబర్ 1014సీలో ఉన్న పెవిలియన్ రెస్టారెంట్ పేరుతో నడుస్తున్న అనధికార నిర్మాణాన్ని శనివారం జూబ్లీహిల్స్ సర్కిల్ టౌన్‌ప్లానింగ్ అధికారులు సీజ్ చేశారు. ఈ నిర్మాణంపై గతంలో పలుమార్లు ఫిర్యాదులు అందడంతో అధికారులు నోటీసులు జారీ చేశారు. ఈ క్రమంలో 2025 మార్చి 13, ఏప్రిల్ 16న ఉప కమిషనర్ ఆధ్వర్యంలో విచారణలు కూడా నిర్వహించారు. దీంతో పాటు సంబంధిత భూమి యజమాని సతీష్ పోలంరెడ్డి నుంచి వివరణలు అందినప్పటికీ రెస్టారెంట్ నడిపేందుకు ఎలాంటి చట్టబద్ధమైన అనుమతులు లేకపోవడం, నివాస ప్రాంతంలో వాణిజ్య కార్యకలాపాలు జరపడం చట్టవిరుద్ధమని అధికారులు స్పష్టంచేశారు. ఈ మేరకు ప్రజల నుంచి వచ్చిన ఫిర్యాదులు, హైకోర్టు ఆదేశాల మేరకు జూబ్లీహిల్స్ సర్కిల్ టౌన్‌ప్లానింగ్ అధికారులు సీల్ వేశారు.

మోడల్ స్కూల్ ఉపాధ్యాయుల క్యాడర్ విభజనకు జీఓ హర్షణీయం

పంజగుట్ట: మోడల్ స్కూల్స్ ఉపాధ్యాయులకు 2018 క్యాడర్ విభజన కోసం జీఓ 317 విడుదల చేసిన రాష్ట్ర ప్రభుత్వానికి తెలంగాణ మోడల్ స్కూల్స్ టీచర్స్ యూనియన్ రాష్ట్ర అధ్యక్షుడు రాజుజాదవ్ కృతజ్ఞతలు తెలిపారు. సోమాజిగూడలో రాష్ట్ర ప్రధాన కార్యదర్శి రవీందర్‌రెడ్డితో కలిసి శనివారం ఆయన మాట్లాడారు. మోడల్ స్కూల్స్‌లో విధులు నిర్వహిస్తున్న ఉపాధ్యాయులకు 12 ఏళ్ల నుంచి పదోన్నతులు లేక ఇబ్బందులు ఎదుర్కొన్నామని, తమ యూనియన్ ఆధ్వర్యంలో ఎందరో మంత్రులు ఉన్నతాధికారులను కలిసి వినతి పత్రాలు ఇచ్చామని గుర్తుచేశారు. జీఓ విడుదలకు సహకరించిన సీఎం రేవంత్‌రెడ్డి, సలహాదారులు వేం నరేందర్‌రెడ్డి, ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి రామకృష్ణ, విద్యాశాఖ సెక్రటరీ యోగిత రాణాకు ధన్యవాదాలు తెలిపారు.

సినిమా షూటింగ్‌లో పనిచేస్తూ.. జల్సాల కోసం బైకుల చోరీ

- 13 ద్విచక్ర వాహనాలు స్వాధీనం
- ఇద్దరు దొంగల రిమాండ్



స్వాధీనం చేసుకున్న బైక్‌లను చూపిస్తున్న బంజారాహిల్స్ ఏసీపీ సామల వెంకట్‌రెడ్డి

బంజారాహిల్స్: ద్విచక్ర వాహనాలను చోరీ చేస్తున్న ముఠాను బంజారాహిల్స్ పోలీసులు అరెస్టు చేసి 13 బైక్‌లను స్వాధీనం చేసుకున్నారు. బంజారాహిల్స్ పోలీస్‌స్టేషన్‌లో శనివారం ఏర్పాటు చేసిన సమావేశంలో ఏసీపీ సామల వెంకట్‌రెడ్డి మాట్లాడుతూ సినిమా షూటింగ్‌లలో పనిచేస్తూ శ్రీకృష్ణానగర్ ఉంటున్న నిమ్మతి శ్రీకాంత్(32), నవీన్(22)లు జల్సాలకు అలవాటుపడి ఈజీ మనీ కోసం దొంగతనాలకు పాల్పడుతూ బైక్‌లు చోరీ చేస్తున్నారు. వాటిని విక్రయిస్తూ సొమ్ము చేసుకుంటున్నారు. ఇటీవల బంజారాహిల్స్ పోలీస్‌స్టేషన్ పరిధిలో బైక్ చోరీలో దర్యాప్తు ప్రారంభించిన పోలీసులకు దొంగలు పట్టుబడ్డారు. వీరి నుంచి 13 బైక్‌లు స్వాధీనం చేసుకున్నారు. వీరు బంజారాహిల్స్ పోలీస్‌స్టేషన్ పరిధిలో 2, జూబ్లీహిల్స్‌లో 1, బేగంపేటలో 3, గోపాలపురంలో 1, బోరబండలో 1, మేడ్చల్‌లో 1, పేట్‌బషీరాబాద్‌లో 1 కేసు నమోదై ఉన్నాయి. ప్రధాన నిందితుడు నిమ్మతి శ్రీకాంత్ తరచూ బైక్‌ల దొంగతనాలకు పాల్పడుతున్నట్లు దర్యాప్తులో తేలింది. పాతుకపల్లి, శామీర్‌పేట, రాంగోపాల్‌పేట, సుల్తానాబాద్ పోలీస్‌స్టేషన్లలో శ్రీకాంత్‌పై కేసులు నమోదై ఉన్నట్లు తేలింది. వీరు బైక్‌లు దొంగతనాలు చేసి షేక్ ఖలీం అనే వ్యక్తికి విక్రయిస్తున్నట్లుగా నిర్ధారించారు. వారిని రిమాండ్‌కు తరలించారు. క్రైమ్ పోలీసులను ఏసీపీ ప్రత్యేకంగా అభినందించారు.

ఘనంగా అంతర్జాతీయ యోగా దినోత్సవం

సికింద్రాబాద్, కంటోన్మెంట్ నియోజకవర్గాల్లో అంతర్జాతీయ యోగా దినోత్సవాన్ని శనివారం ఘనంగా జరుపుకున్నారు. ఈ సందర్భంగా విద్యాసంస్థలు, కాలనీలు, బస్తీలు, పార్కులు, యోగా కేంద్రాల్లో చిన్నాపెద్ద తేడా లేకుండా యోగాసనాలు వేశారు.

– సికింద్రాబాద్, కంటోన్మెంట్ జోన్ల బృందం



బొల్లారం రాష్ట్రపతి నిలయంలో..



పికెట్‌లోని వాజ్‌పేయి పార్కులో యోగా చేస్తున్న కంటోన్మెంట్ బోర్డు ఉన్నతాధికారులు, సిబ్బంది



యోగాసనాలు వేస్తున్న రైల్వే జీఎం అరుణ్‌కుమార్ జైన్



ల్యాండ్‌స్కేప్ గార్డెన్‌లో ..



బన్సీలాల్‌పేట్‌లో బీజేపీ ఆధ్వర్యంలో..



ఇరిసెట్‌లో డైరెక్టర్ జనరల్ శరద్‌కుమార్ శ్రీవాస్తవ, అధికారులు